నాడు అతిథి గృహం.. నేడు శిథిలరాగం



వసతి గృహ సముదాయ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనం



గోపాలపట్నం: సిం హాచలం దేవ స్థానానికి వచ్చే భక్తులకు ఆశ్రయం కల్పించిన అతిథిగృహాలు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గంజాయి, మందుబాబులు, పేకాట ఆడే వారితో పాటు ఇతర కార్యక్రమాలకు ఈ గదులను వినియోగిస్తున్నారు. దీంతో అటు వైపు సాధారణ ప్రజలు వెళ్లాంటే వణుకుతున్నారు. మరో వైపు ఉన్న స్థలంలో అక్రమార్కులు పాగా వేశారు. ఆక్రమణలతో పాటు శిథిభవనాలను తొలగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనమైన చరిత్ర

జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో జిల్లా పరిషత్ అతిథిగృహం నిర్మించారు. దీని ఘన చరిత ఇప్పుడు మరుగున పడిపోయింది. దశాబ్దాల కిందట రోడ్డు ట్రాన్స్‌పోర్టు తక్కువగా ఉన్న సమయంలో సింహాచలం వెళ్లే భక్తులకు ఈ వసతి గృహాలు సేద తీర్చాయి. సింహాచలం స్టేషన్‌లో రైలు దిగిన తర్వాత సింహాచలం వెళ్లలేని వారికి, దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యే భక్తులకు ఉపయోగపడే విధంగా ఈ సముదాయాలు నిర్మించారు. చాలా ఏళ్లు యాత్రికులకు మంచి సేవలు అందించింది. రానురానూ వీటి వినియోగం తగ్గిపోయింది. దీంతో భవనాలు శిథిలమయ్యాయి. ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మరో వైపు ఖాళీ స్థలంలో అక్రమార్కులు పాగా వేశారు.



అసాంఘిక కార్యకలాపాలు ఇక్కడే....

ఆక్రమణకు గురైన స్థలం

ఎకరాల్లో ఉన్న స్థలం ఇప్పుడు గజాల్లో మాత్రమే మిగిలింది. స్థానికంగా ఉన్న స్థలాన్ని ఆక్రమంచి భవనాన్ని నిర్మించినా కనీసం టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా పట్టించుకోలేదు. ఇప్పుడు రెండు అంతస్తుల్లో దర్జాగా ఉంటున్నారు. శిథిలమైన గదులను వ్యాపారస్తులు తమ అవసరాలకు, మందుబాబులు, ఇతరులు అసాంఘిక కార్యకలాపాలకు దర్జాగా వాడుకుంటున్నారు. ఈ సముదాయం నుంచి వెనుకన ఉన్న సులాభ్ కాంప్లెక్స్ వరకు జిల్లా పరిషత్‌కు సంబంధించినదేనని అధికారులు చెబుతున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ సందర్శనతో వెలుగులోకి

శిథిల భవన సముదాయాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర అధికారులతో కలిసి సందర్శించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సముదాయాన్ని అభివృద్ధి చేస్తే ఆకతాయిల బెడతీరుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సింహాచలం రైల్వే స్టేషన్‌తో పాటు ఇది కూడా అభివృద్ధి చెందితే ఈ ప్రాంతం రూపు రేఖలు మారిపోతాయని చెబుతున్నారు.

కౌన్సిల్ సిఫార్సు మేరకు అభివృద్ధి

ఇటీవల చైపర్సన్ సుభద్రతో పాటు మేము అతిథి గృహ సముదాయాలను పరిశీలించాం. ఈ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ అధికారులకు లేఖ రాశాం. జిల్లా పరిషత్ కౌన్సిల్ సమావేశంలో గృహ సముదాయం అభివృద్ధిపై నిర్ణయం తీసుకుంటారు. ఈ స్థలం లీజుకు కావాలని జీవీఎంసీ అధికారులు అడిగారు. దానిపై కూడా కౌన్సిల్ పరిశీలిస్తుంది. ఆక్రమణలు తొలగించిన తర్వాత అభివృద్ధిపై చర్యలు చేపడతాం.

– నారాయణ మూర్తి, జెడ్పీ సీఈవో

స్వచ్ఛత అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో సోమవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చీపుర్లతో శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అపారిశుధ్యం వల్ల వ్యాధులు విజృంభిస్తాయన్నారు. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిట్టిమిరెడ్డి వీరు నాయుడు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కనక మహాలక్ష్మీ నగర్‌లో వెలసిన కనక మహా లక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కనక మహాలక్ష్మీ నగర్ కాలనీ ప్రతినిధులు ఇడదాసరి గోపాలరావు, రాంప్రసాద్, నాయుడు, డీటీ నాయుడు, నాయుడు, శేషగిరిరావు, సోమేశ్వరరావు, రూప్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి శిక్షణ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరమాండల్ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు

మల్కాపురం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం(హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు అన్నారు. 60వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీ ప్రాంత మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యూయలరీ మేకింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.శిక్షణ పూర్తయిన తర్వాత ఆర్టిఫిషియల్ జ్యూయలరీ మేకింగ్ కిట్‌లు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు శోభన్‌బాబు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

గోపాలపట్నం: చలన చిత్ర పరిశ్రమలో శోభన్ బాబు అరుదైన రికార్డు నెలకొల్పారని శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు అన్నారు. ఆనాటి చరిత్రను గుర్తు చేసుకుంటూ గోపాలపట్నంలో సోమవారం వేడుక నిర్వహించారు. శోభన్ బాబు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ ఆయన తీసిన సోగ్గాడు, జేబు దొంగ, బలిపీఠం, దేవుడు చేసిన పెళ్లి, అందరూ మంచి వారే, గుణవంతుడు, జీవన జ్యోతి ప్రేక్షకుల ఆదరణ పొందాయన్నారు. ఆ చిత్రాల స్టిల్స్‌తో కూడిన గోడ పత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గొరకల రామదాసు, గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు టి. రామచంద్రరావు, కోశాధికారి కేతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో ఇద్దరికి ఆశ్రయం



సులారాం మజహిని షెల్టర్ హోంకు అప్పగిస్తున్న రైల్వే పోలీసు కానిస్టేబుల్ సింహాచలం



ఏయూటీడీ షెల్టర్‌లో అప్పలరాజు

సీతమ్మధార: జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహంలో సోమవారం ఇద్దరికి ఆశ్రయం కల్పించారు. ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన సులారాం మజహి(55) కొద్దికాలంగా రోడ్డు మీద కాగితాలు, బాటిల్స్ ఏరుకుంటూ దుర్భర జీవితం సాగిస్తున్నాడు. ఒంటరి జీవితం గడుపుతూ రైల్వేస్టేషన్‌లో ఉంటున్న అతని దీనస్థితికి చలించిన రైల్వే పోలీసు కానిస్టేబుల్ సింహాచలం ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ హోమ్‌కు అప్పగించారు. ఈ రెస్క్యూలో ఏయూటీడీ కేర్‌టేకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయనగరంవాసి అప్పలరాజుకు ..

ఉపాధి కోసం వలస వచ్చిన విజయనగరం జిల్లా, ఎస్.కోట, మొక్కలపాడు గ్రామానికి చెందిన అప్పలరాజుకు జీవీఎంసీ టీఎస్సార్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వైజాగ్‌లో కేటరింగ్ వర్క్ చేస్తున్న అప్పలరాజుకు బాక్స్ మూత తగిలి చేతికి గాయమైంది. దీంతో ఏయూటీడీ ద్వారా వైద్య సహాయం అందిస్తున్నారు. గాయం నయమయ్యే వరకు చికిత్స పొంది, ఊరుకు వెళ్లిపోతానని అప్పలరాజు చెప్పాడు. సిబ్బంది తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు.

బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఎన్నికల ముందు హామీని చంద్రబాబు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మధు

డాబాగార్డెన్స్: బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బేడా బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.మధు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ జంగాలు అన్ని విధాలుగా బాగా వెనకబడి ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2008 వరకు బేడ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసేవారని చెప్పారు. అదే ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం బేడ జంగాలకు న్యాయం చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు మాత్రం వచ్చేది మన ప్రభుత్వమే అంటూ..బేడ జంగాలను వాడుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబునాయుడు, లోకేష్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్యకు పురస్కారం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్యకు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఐఎస్టీఈ నేషనల్ బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని పంజాబ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్‌లు లామ్రిన్ టెక్ స్కిల్ యూనివర్సిటీ(రోపర్, పంజాబ్)లో జరిగిన 54వ ఐఎస్టీఈ నేషనల్ వార్షిక ఫ్యాకల్టీ కాన్వెన్షన్‌లో ఆయనకు అందజేశారు. ఆచార్య వెంకట సుబ్బయ్య వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రొఫెషనల్ బాడీల్లో ప్రాధాన్యమైన నాయకత్వాన్ని, శాస్త్రీయ పరిజ్ఞానంలో చేసిన కృషిని గుర్తిస్తూ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వెంకట సుబ్బయ్యకు ఏయూ ఆచార్యులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో భద్రత చర్యలు చేపట్టాలి



స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం మొహంతితో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు సోమవారం సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతిని కలిసి సమస్యలను వివరించారు. బీసీ గేటు, మెయిన్ గేటులో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల రాకపోకల సమయంలో గేదెలు, పందులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించడం వల్ల ఒకే గేటులో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు రాకపోకలు సాగించడం వల్ల రద్దీ తీవ్రంగా ఉందన్నారు. దీనిపై సీజీఎం మొహంతి మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భద్రతకు సంబంధించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కారురమణ, మద్ది అప్పలరాజు రెడ్డి, ప్రభాకరరెడ్డి, రమణమూర్తి, ఎస్.ఎ.నాయుడు, పి.వి. నగేష్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని ఆలయ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బుజ్జి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 13వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన భువనగిరి బుజ్జి (42)ఓ ఏజెన్సీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని బుజ్జి స్కూటీపై ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి నాతయ్యపాలెంలోని తన నివాసానికి వస్తున్నాడు. సరిగ్గా స్కూటీను మింది విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు షీలానగర్ లోని కిమ్స్ ఐకాన్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఆధ్యాత్మిక వైభవం.. అప్పికొండ క్షేత్రం

- 500 ఏళ్ల చరిత్ర గల ఆలయం
- మహా శివరాత్రికి సోమేశ్వరస్వామి ఆలయం ముస్తాబు
- విస్తృతంగా ఏర్పాట్లు
- పోటెత్తనున్న భక్త జనం



రాతితో నిర్మించిన ఆలయం





పూజలందుకునేందుకు సిద్ధమైన శివలింగం

పెద గంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం 500 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. ఏటా తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శివరాత్రి మందు రోజు లక్షల్లో భక్తులు తరలి వచ్చి ఇక్కడే జాగారం చేస్తారు. సాగరతీరంలో ఆలయం ఉండడంతో తెల్లవార్లూ జాగారం చేసిన తర్వాత సూర్యోదయ సమయంలో సముద్ర స్నానాలు ఆచరించి ఆపై స్వామి వారిని దర్శించుకుంటారు. ఇందుకు తగ్గట్టుగా దేవదాయ శాఖ ఈవో కె. శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సమన్వయంతో ఏర్పాట్లు

ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానుండడంతో దేవదాయ శాఖ, జీవీఎంసీ, పోలీసు, రెవెన్యూ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రుద్రాభిషేకంతో పూజలు ఆరంభం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న వేకువ జామున 4 గంటలకు నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం నుంచి భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. భక్తుల కోసం ఆర్టీసీ 100 ప్రత్యేక బస్సులు నడపనుంది.

రాత్రంతా సందడే సందడి

దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో కలసి భక్తులు తరలివస్తారు. 25 సాయంత్రం నుంచి మరుసటి రోజు వరకూ ఇక్కడే ఉంటారు. రాత్రంతా సందడి చేస్తారు.

పుణ్యస్నానాలకు తీరం సిద్ధం

సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అప్పికొండ తీరాన్ని శుభ్రం చేశారు. ఎక్కడా చెత్తా చెదారం లేకుండా, ఇసుక దిబ్బలను పొక్లెయిన్‌తో చదును చేయించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయించారు. భక్తుల కోసం ప్రత్యేకంగా స్నానపు గదులు, మొబైల్ టాయిలెట్లు, దుస్తులు మార్చుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. రెండు రోజులపాటు భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆకట్టుకునే శిల్ప సంపద

సోమేశ్వర స్వామి ఆలయంలో శిల్ప సంపద, శిలాశాసనాలు గత ప్రాభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. శివలింగాలు, నల్లరాతి శిల్పాలు,బోశుల శిలాశాసనాలు, అతిపెద్ద మహానంది, ప్రశాంత సముద్ర తీర ప్రాంతంలో డచ్ కాలం నాటి స్థూపాలు, శిల్పాలు ఆకట్టుకుంటాయి.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌కు ప్రవేశాలు



సమన్వయకర్త డాక్టర్ ప్రభావతమ్మ

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయకర్త డాక్టర్ సి.ప్రభావతమ్మ తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. విశాఖ జిల్లాలోని మధురవాడ, మేహాద్రిగెడ్డ, శ్రీకృష్ణాపురం, అనకాపల్లి జిల్లాలోని కోనాం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి, గొలుగొండ, దేవరాపల్లి, సబ్బవరం కలిసి మొత్తం 11 పాఠశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థినీ విద్యార్థులు వచ్చే నెల 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ నెంబర్ 0891 2799641లో లేదా, దగ్గరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను సంప్రదించాల్సిందిగా కోరారు.

అంగన్‌వాడీల ఆందోళన

సబ్బవరం: అంగన్‌వాడీల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సోమవారం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిటు) జిల్లా కోశాధికారి వీవీ రమణమ్మ, సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ,గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలందిస్తూ, అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉప్పాడ సత్యవతి, తోపుడు బళ్ల సంఘం నాయకులు గొరేష్, అంగన్‌వాడీల సంఘం కార్యదర్శి ఎం.రమణి, ఉపాధ్యక్షురాలు బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనిల్‌కు అభినందన



వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌ను అభినందిస్తున్న దేవన్‌రెడ్డి,పి.వి.సురేష్

మల్కాపురం: వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాయపురెడ్డి అనిల్ కుమార్ సోమవారం వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పలదేవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి అభినందించి నిరుద్యోగుల, కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్, పశ్చిమ నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూండి మల్లేశ్వరరావు, గుంట సుందర్‌రావు,రమేష్, శ్రీను పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న అప్పలరాజు యాదవ్ తదితరులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ అన్నారు. నక్కవానిపాలెంలోని యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ విస్తరణ పనుల్లో చేస్తున్న కార్మికులకు కనీస వసతులు, కనీస వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.కార్మిక సమస్యలపై యాజమాన్యం, కాంట్రాక్టర్లు స్పందిచకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

23న న్యూ డెమొక్రసీ పార్టీల విలీనం



జీవీఎంసీ గాంధీ పార్కులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీతమ్మధార: విజయవాడలో రెండు న్యూ డెమొక్రసీ పార్టీల రాష్ట్రస్థాయి విలీన సభ ఈ నెల 23న జరగనుందని న్యూ డెమొక్రసీ విశాఖ, విజయనగరం ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2013లో చీలికకు గురై రెండు న్యూ డెమొక్రసీ పార్టీలుగా రాష్ట్రంలో కార్యాచరణ సాగిస్తున్న పార్టీలు.. తిరిగి ఏకం కావాలని నిర్ణయించాయని వెల్లడించారు. అందుకు విజయవాడ వేదిక కానుందన్నారు. ఈ సానుకూల పరిణామాన్ని విప్లవ, ప్రజాస్వామిక శక్తులు, అస్తిత్వవాదులు బలపరచాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎం.ఎన్.ఎస్.ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, నగర కన్వీనర్ ఈ.లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు డి.ఏదుకొండలు, ఉపాధ్యక్షుడు కె. బాలనాగమ్మ పాల్గొన్నారు.

శిశుగృహ సందర్శన



రికార్డులను తనిఖీ చేస్తున్న చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు పద్మావతి

మర్రిపాలెం: జీవీఎంసీ 58వ వార్డు ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న శిశుగృహను రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సోమవారం సందర్శించారు. శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సమీపంలో ఉన్న నరేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందరర్శించి చిన్నారుల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చిన్నారుల జనన సర్టిఫికెట్లు జారీ చేయడంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో ఎంవీ రమణకుమారి, భీమిలి సీడీపీవో శ్రీదేవి, శిశుగృహ మేనేజర్ సుజాత, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు శారదా దేవి, లోవలక్ష్మి పాల్గొన్నారు.